సాక్షి పల్నాడు

గురువారం । 28 । నవంబర్ । 2024



ఎస్‌బీఐ వితరణ

మంగళగిరి: వీవర్స్ కాలనీలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఎస్‌బీఐ తరఫున రూ.5 లక్షల విలువైన సామగ్రి అందించారు. జీఎం శైలేష్‌కుమార్ పాల్గొన్నారు.



అమ్మవారికి జ్వాలా కిరీటం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం మహంకాళికి దరియావలి, నాగమణి దంపతులు రూ.2 లక్షల విలువైన పంచ శిరస్సుల నాగాభరణ జ్వాలా కిరీటం అందించారు.

ఏకాదశ రుద్రాభిషేకం



రేపల్లె రూరల్: ఇసుకపల్లిలోని భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, బిల్వ పత్రాలతో అభిషేకం నిర్వహించారు. స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన



అమరావతి: ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమరావతి అమరేశ్వరాలయంలో బుధవారం లక్షబిల్వార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు తొలుత మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. ఆలయ అర్చకులు స్వామివారికి విశేష అలంకరణ చేసి సహస్ర నామాలతో వేడుక జరిపారు. బాల చాముండికా అమ్మ వారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఫ్లాగ్ డే విరాళాలు అందజేయండి



నరసరావుపేట: దేశ రక్షణలో అమరులైన సైనికుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రజలు, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు విరివిగా విరాళాలు అందజేయాలని జిల్లా సైనిక సంక్షేమాధికారి గుణశీల కోరారు. సాయుధ దళారులు, మాజీ సైనికులు, వితంతువుల సంక్షేమం కోసం డిసెంబరు 7వ తేదీన నిర్వహించే ఫ్లాగ్ డేను పురస్కరించుకొని బుధవారం తన క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పోస్టర్, కార్ ఫ్లాగ్స్, పతాక స్టిక్కర్లను ఆవిష్కరించారు. విరాళాలు అందించే వారు ఆన్‌లైన్ ద్వారా ఎస్‌బీఐ, ఎంజీరోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ, కరెంటు అకౌంట్ నం .3388 1128 795, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0016857, ఎంఐసీఆర్ నం. 5200 02046 ద్వారా గానీ, డైరెక్టర్, సైనిక్ వెల్ఫేర్, విజయవాడ పేరిట చెక్కు ద్వారా గుంటూరు హిందూకళాశాల ఎదురుగా ఉన్న జిల్లా సైనిక సంక్షేమాధికారికి పంపాలని గుణశీల కోరారు.

జమ్మలమడక వద్ద సాగర్ కుడి కాలువలో నిండుగా ప్రవహిస్తున్న నీరు



నిండు ప్రాణాలు.. నీటిపాలు!

ఎన్‌ఎస్‌పీ కాలువలో పడి పలువురు మృతి

- మూడు నెలల్లోనే 23 మంది మృత్యువాత
- ఈత, స్నానాలు, సెల్ఫీల కోసం దిగడమే కారణం
- మాచర్ల, ఈపూరు, బొల్లాపల్లి మండలాల్లో అత్యధికం

నిండుగా కాలువలో నీరు ప్రవహిస్తుంటే ఈత కొట్టాలని దిగిన కొందరు ప్రవాహ వేగానికి బలవుతున్నారు. మరికొందరు అత్యుత్సాహంతో సెల్ఫీలు, ఫొటోలు దిగడంలో ఏమరుపాటు కారణంగా నీటిలో పడి చనిపోతున్నారు. మరికొందరు నిర్లక్ష్యం కారణంగా, ఇంకొందరు ప్రమాదవశాత్తూ సాగర్ కెనాల్‌లో పడి ప్రాణాలు కోల్పోతున్నారు. కన్నవారికి, కుటుంబ సభ్యులకు తీరని వేదన మిగులుస్తున్నారు. ప్రవాహ ఉధృతి ఎక్కువగా ఉండటంతో నిండు జీవితాలు నీటిపాలవుతున్నాయి.

సాక్షి, నరసరావుపేట: నరసరావుపేట రూరల్ మండలం రావిపాడు పంచాయతీ పరిధిలోని బాలయ్య నగర్‌కు చెందిన పసుమర్తి సంతోష్(20), చిరుతల సుధీర్ (8)లు సెప్టెంబర్ 10వ తేదీ సాయంత్రం సమీపంలోని చిలకలూరిపేట మేజర్ కెనాల్‌లో ఈతకు వెళ్లారు. లోతు ఎక్కువగా ఉండేసరికి సుధీర్ మునిగిపోవడంతో కాపాడే ప్రయత్నంలో సంతోష్ సైతం నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. ఇలా లోతు ఎక్కువ ఉందని తెలిసీ కొంతమంది ఈతకు వెళ్లి నీట మునిగి చనిపోతున్నారు. కొంతమంది కాలుజారి, మరికొందరు కార్తిక మాస పవిత్ర స్నానాలకు వెళ్లి కాలువల్లో పడి మృత్యువాత పడుతున్నారు. నాగార్జున సాగర్ కుడి కాలువకు ఈ ఏడాది ఆగస్టు 5వ తేదీన నీరు విడుదల చేసిన తరువాత కాలువల్లో నీట మునిగి ఏకంగా 23 మంది మరణించారు. సాగర్‌లో పుష్కలంగా నీరు ఉండటంతో పూర్తి స్థాయిలో కాలువలు గత మూడు నెలలుగా పారుతున్నాయి. ఈత, స్నానానికి, పశువులను ఒడ్డుకు చేర్చే క్రమంలో కాలుజారి తదితర కారణాలతో కాలువల్లోకి దిగి మృత్యువాత పడుతున్నారు.



ఈపూరు మండలం ముప్పాళ్ల వద్ద సాగర్ కాలువలో గల్లంతైన చిన్నారుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది (ఫైల్)

ప్రవాహాన్ని అంచనా వేయలేక...

ఎన్ఎస్‌పీ కాలువల్లో నీటి ప్రవాహం చూసి చాలా మంది ఉత్సాహంతో ఈత కొట్టాలని, నీటిలో దిగి సెల్ఫీలు తీసుకోవాలని ఆశపడతారు. అయితే కాలువ లోతు, నీటి ప్రవాహాన్ని అంచనా వేయడంలో పొరబడుతున్నారు. తద్వారా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈత బాగా వచ్చిన వారైనా సరే ప్రవాహంలో కొట్టుకుపోయే అవకాశం ఉంది. మరికొంతమంది ఈత రాకపోయినా ఫొటోలు దిగుదామనో, కాళ్లుచేతులు కడుక్కుందామనో వెళ్లి నీటిలో పడి మరణిస్తున్నారు. పోలీసులు పదే పదే హెచ్చరిస్తున్నా బేఖాతరు చేస్తున్నారు. మరికొంత మంది ఆవేశంలో ఆత్మహత్యకు పాల్పడాలన్న ఆలోచనతో కాలువల్లో దూకుతున్నారు. ఇలాంటి ఘటనలు మాచర్ల, ఈపూరు, బొల్లాపల్లి మండలాల్లో ఎక్కువగా జరుగుతున్నాయి. దుర్గి, నకరికల్లు మండలాల్లో తరచూ సంభవిస్తున్నాయి.

ఇవిగో నిదర్శనాలు...

- ఈ ఏడాది సెప్టెంబర్ 8వ తేదీన చిలకలూరిపేట మేజర్ కెనాల్‌పై లస్కర్‌గా పనిచేస్తున్న ఎం.లక్ష్మయ్య విధి నిర్వహణలో భాగంగా మరమ్మతులు చేస్తూ కాలువలో కొట్టుకుపోయి మరణించారు.
- అమరావతి మండలం దిడుగులో బాప్టిజం స్వీకరించేందుకు కృష్ణానదిలో దిగి ప్రమాదవశాత్తు కంభంపాటి సందీప్ (37), గోశే ధనుష్ (17)లు మృత్యువాత పడ్డారు. మరో ముగ్గురిని స్థానికులు కాపాడారు.
- నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామానికి చెందిన తాటికొండ వెంకయ్య (18) అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో ఈతకు వెళ్లి గల్లంతైన ఘటన ఈ నెల ఒకటో తేదీన చోటుచేసుకుంది.
- ముప్పాళ్ల మండలం నార్నెపాడుకు చెందిన షేక్ అల్లాభక్ష్ (40) గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో ప్రమాదవశాత్తూ పడి మరణించారు.
- మాచర్ల న్యూటన్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న మానిష్‌కాంత్ రెండు నెలల కిందట సాగర్ కుడి కాలువ వద్ద సెల్ఫీలు దిగేందుకు ప్రయత్నించి కాలు జారి కొట్టుకుపోయారు.
- నూజెండ్ల, గురజాలలో పశువులు కాసే మహిళలు వాటిని ఒడ్డుకు చేర్చే క్రమంలో కాలువలో పడి మరణించిన ఘటనలు నమోదయ్యాయి.
- ఈ నెల 21వ తేదీన ఈపూరు మండలం ముప్పాళ్ల వద్ద కాలవలో ప్రమాదవశాత్తు పడి ఇద్దరు చిన్నారులు యామిని (11), కావ్య (7)లు మరణించారు. నీటిలో పడి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న తండ్రిని స్థానికులు కాపాడారు.



జమ్మలమడక వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న సాగర్ కుడి కాలువలో స్నానం చేస్తున్న దృశ్యాలు

బాల్య వివాహ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



నరసరావుపేట రూరల్: బాల్య వివాహ రహిత సమాజాన్ని నిర్మించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహ రహిత భారతదేశం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు జిల్లాలో బుధవారం ప్రారంభిచారు. శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో ముందుగా ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ జరిపారు. కలెక్టర్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. బాల్య వివాహాల వలన మహిళలకు ఎదురయ్యే సమస్యలను కలెక్టర్ తెలియజేశారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలలోపు వివాహం చేయడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారని తెలిపారు. బాల్య వివాహాలు లేని సమాజం వైపు అందరం అడుగులు వేద్దామని పిలుపునిచ్చారు. ఈ వివాహాల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.మధులత, దిశ డీఎస్పీ రమణ, డీఈవో చంద్రకళ, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి, ఏసీడీపీవో మాణిక్యరావు, లీగల్ సెల్ అధ్యక్షులు అమూల్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 2010 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 96, బ్యాంక్ కెనాల్‌కు 100, తూర్పు కెనాల్‌కు 50, పశ్చిమ కెనాల్‌కు 65, నిజాంపట్నం కాలువకు 200, కొమ్మమూరు కాలువకు 2140 క్యూసెక్కులు విడుదల చేశారు.

దారి దోపిడీ కేసుల్లో ముగ్గురు నిందితులకు జైలు

నరసరావుపేట టౌన్: రెండు దారి దోపిడీ కేసుల్లో నేరం రుజువు కావడంతో నిందితులకు ఒక్కొక్కరికి ఐదు సంవత్సరాల చొప్పున జైలు శిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ సెషన్స్ న్యాయాధికారి పూర్ణిమ బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. 2021 డిసెంబర్ 6న యడ్లపాడు మండలం లింగారావుపాలెం గ్రామానికి చెందిన మద్దు వీరయ్య తన భార్యతో గుంటూరు వెళ్లి స్వగ్రామానికి వస్తుండగా బోయపాలెం వద్ద ఎనిమిది మంది దాడి చేశారు. వారి నుంచి రూ.2,300 నగదు, మరో ఘటనలో డిసెంబర్ 7న సొలసకు చెందిన పోనుగుపాటి వీరాంజనేయులుపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి రూ.2,000 దోచుకున్నారు. రెండు ఫిర్యాదులను స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు గ్రామానికి చెందిన ఆకుల లింగమయ్య, ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం అమ్మవరం గ్రామానికి చెందిన దాసరి ఓబులేసు, నంద్యాల పట్టణానికి చిన్న ఇండ్ల రమణయ్యతో పాటు మరో ఐదుగురిని నిందితులుగా గుర్తించి, అరెస్ట్ చేశారు. చోరీకి గురైన సొత్తును వారి నుంచి స్వాధీనం చేసుకొని కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. బెయిల్‌పై విడుదలైన వారిలో ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నారు. మిగతా ముగ్గురు నిందితులకు గతంలో ఓ కేసులో 20 సంవత్సరాలు శిక్ష పడటంతో ప్రస్తుతం నెల్లూరు జిల్లా జైల్లో ఉన్నారు. ఈ ముగ్గురిపై మరో రెండు నేరాలు సైతం రుజువు కావడంతో ఒక్కొక్క కేసులో నిందితులకు ఐదు సంవత్సరాల చొప్పున జైలు శిక్ష మొత్తాన్ని ఏకకాలంలో అనుభవించేలా న్యాయాధికారి తీర్పులో పేర్కొన్నారు.

పోస్టల్ టార్‌గెట్స్

తపాలా శాఖలో బిజినెస్ డెవలప్‌మెంట్ పేరుతో అసాధ్యమైన టార్గెట్లను పూర్తి చేయాలని ఉన్నతాధికారి ఒకరు కింది స్థాయి సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి పెంచుతున్నారు. విజయవాడ సర్కిల్ కార్యాలయానికి చెందిన ఆ అధికారి ఒక అడుగు ముందుకేసి కేంద్ర సహాయ మంత్రి వద్ద, తన పైఅధికారుల మెప్పు కోసం యత్నిస్తున్నారు. మంత్రి అండదండలు ఉన్నాయని చెబుతూ ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నట్లు సమాచారం.



ఆర్థిక లక్ష్యాల పిడుగు

- కింది స్థాయి ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి
- వివాదాస్పదంగా బిజినెస్ డెవలప్‌మెంట్ విభాగ ఇన్‌చార్జి తీరు
- ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ఫలితం శూన్యం
- సొంత డబ్బు వెచ్చించాల్సిన దుస్థితిలో సిబ్బంది
- సాధ్యం కాని టార్గెట్లు ఇవ్వొద్దని వినతి



సెప్టెంబర్ 9న గుంటూరులో పోస్టల్ ఉద్యోగుల నిరసన

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): పోస్టల్ శాఖ విజయవాడ రీజియన్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న అధికారి ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ బిజినెస్ డెవలప్‌మెంట్ విభాగ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన విజయవాడ రీజియన్ పరిధిలోని కిందిస్థాయి సిబ్బందిని ఆర్థిక లక్ష్యాలు(టార్గెట్ల) పేరుతో వేధిస్తున్నారు. తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. దీంతో రీజియన్ పరిధిలోని నెల్లూరు, ప్రకాశం, మార్కాపురం, గుంటూరు, తెనాలి, పల్నాడు, విజయవాడ, భీమవరం, మచిలీపట్నం, ఏలూరు కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు బెంబేలెత్తిపోతున్నారు. సుమారు 20 ఏళ్లుగా పనిచేస్తున్న తమను ఇన్‌చార్జి కులం పేరు చెప్పి బెదిరిస్తున్నాడని లబోదిబోమంటున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా టార్గెట్లు పూర్తి చేయించడంలో ఆరితేరిన వ్యక్తిగా ఆ అధికారి పేరు పొందడంతో ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని చెబుతున్నారు. పైగా గతంలో ఈ అధికారి ఐపీఎఎస్‌పీ అసోసియేషన్ సెక్రటరీగా సుదీర్ఘకాలం పనిచేశారని పేర్కొంటున్నారు.

బలవంతంగా ఖాతాలు తెరవాల్సిందే..

పోస్టల్ సేవింగ్స్ ఖాతాలు పెంచాలని ఆ అధికారి ఒత్తిడి చేస్తుండడంతో ఉద్యోగులు బలవంతంగా వేలల్లో ఖాతాలు తెరుస్తున్నారు. దీనికోసం చేతిచమురు వదిలించుకుంటున్నారు. అయినా ఇంకా ఖాతాలు పెంచాలని ఆ అధికారి తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఇన్సూరెన్సు లక్ష్యాలూ విధిస్తున్నారు. ఫలితంగా ఉద్యోగులు ఆందోళనల బాట పట్టారు. 90 శాతం ఉద్యోగులపై టార్గెట్ల ఒత్తిడి ఉందని యూనియన్ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ధర్నాలు చేశారు. అయినా ఉన్నతాధికారుల్లో చలనం లేదు.

ఒత్తిడి తట్టుకోలేక మరణాలు



ఉత్తరాల బట్వాడా సిబ్బందిని బిజినెస్ టార్గెట్లకు వినియోగించవద్దని, డెలివరీ శాతం పెంచాలని పోస్టల్ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు ఉన్నా.. ఆ అధికారి పెడచెవిన పెడుతున్నాడు. టార్గెట్‌లు పూర్తి చేయాల్సిందేనని, బీమాలు చేయించాల్సిందేనని కిందిస్థాయి ఉద్యోగులపై ఒత్తిడి తెస్తున్నాడు. ఈ ఒత్తిడి తట్టుకోలేక రెండేళ్ల క్రితం మచిలీపట్నం టౌన్‌లో పనిచేసే సబ్ పోస్ట్‌మాస్టర్ గుండెపోటుతో మరణించారు. అనంతపురం జిల్లా కళ్యాణ దుర్గం మండలం, హులికల్లు కొండలో మరో పోస్టుమాస్టర్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఇదిలా ఉంటే సంస్థాగతంగా నెలకొన్న కంప్యూటర్ నెట్‌వర్క్ సమస్యలను మాత్రం ఆ అధికారి పట్టించుకోవడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నా దృష్టికి రాలేదు

గుంటూరు డివిజన్ పరిధిలో ఉద్యోగులపై తీవ్ర టార్గెట్ల ఒత్తిడి ఉన్న విషయం నా దృష్టికి రాలేదు. విధి నిర్వహణలో ఇది ఒక భాగం. యూనియన్ నాయకులు చేసిన ధర్నాలు దేశవ్యాప్తంగా చేసినవి.

– యలమందయ్య, గుంటూరు డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్

గిరిజనుల జీవితాల్లో చిగురాశలు

నాబార్డు ఆర్థిక సహకారంతో అవార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లాలోని నకరికల్లు, రాజుపాలెం మండలాల్లో నాబార్డు టీడీఎఫ్ (ట్రై బల్ డెవలప్‌మెంట్ ఫండ్)లో భాగంగా మా తోట అభివృద్ధి పథకం అమలు చేస్తున్నారు. ఈ పథకంలో గిరిజనుల సమగ్ర అభివృద్ధి కృషి చేస్తున్నారు. ఆరేళ్ల కాల పరిమితి గల ఈ పథకంలో పండ్ల తోటల పెంపకం, మార్కెటింగ్, ఉపాధి వంటి అవకాశాలు కల్పిస్తున్నారు.



నకరికల్లులో లబ్ధిదారులకు మామిడి మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

- రైతుల సమగ్రాభివృద్ధికి నాబార్డు చేయూత
- ఉచితంగా మామిడి, బత్తాయి మొక్కలు పంపిణీ
- ట్యాంకర్‌ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు
- సస్యరక్షణ, మార్కెటింగ్‌కు సహకారం
- 'మా తోట అభివృద్ధి' పథకంపై శిక్షణ తరగతులు

నకరికల్లు: రెండేళ్లుగా అమలు చేస్తున్న పథకం ద్వారా నకరికల్లు, రాజుపాలెం మండలాల్లోని దాదాపు 429 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. ప్రధానంగా హార్టికల్చర్ డెవలప్‌మెంట్, భూసార అభివృద్ధి పనులు, వాటర్ రీసోర్స్ డెవలప్‌మెంట్ యాక్టివిటీస్, జీవనోపాధి వంటి కార్యక్రమాలు చేపడతున్నారు. 2023–24 సంవత్సరంలో 200 మంది ఎస్టీ రైతులను లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. ఈ పథకం ద్వారా లబ్ధి చేకూర్చారు. 2024–25 ఏడాదికిగాను ఇప్పటికే 229 మంది రైతులను ఎంపిక చేశారు. భూమి లేని నిరుపేదలు మరో 50 మందిని గుర్తించి వారి ఉపాధికి బాటలు వేశారు. ఇప్పటికే 100 ఎకరాల్లో పండ్ల తోటలు వేయడం పూర్తి



చేజర్లలో వేప పిండి, వర్మీ కంపోస్టు ఎరువుల పంపిణీ

కాగా... మరో 129 ఎకరాలను ఈ ఏడాది డిసెంబర్ కల్లా వినియోగంలోకి తీసుకురానున్నారు.

ఆరో ఏడాది నుంచి మార్కెటింగ్...

పంట వేసి ఐదేళ్ల కాలం పూర్తి చేసుకున్న తరువాత రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ చేయిస్తారు. సంఘంలోని రైతులకు మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తారు. ఆసక్తి గల వారికి ప్రాసెసింగ్ యూనిట్‌లను ఏర్పాటు చేసుకునేందుకు సహకారం అందిస్తారు. అలాగే నాచురల్ ఫార్మింగ్‌పై అవగాహన కల్పిస్తారు.

దరఖాస్తు చేసుకునే అవకాశం



నాబార్డు సౌజన్యంతో అవార్డు సంస్థ ద్వారా గిరిజన రైతుల అభివృద్ధి కోసం చేపడుతున్న ఈ పథకంలో లబ్ధి పొందేందుకు ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్టీ రైతులు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పొలం పాస్‌పుస్తకం జిరాక్స్‌లతో నకరికల్లులోని కార్యాలయంలో సంప్రదించవచ్చు. వివరాలకు ఫోను నెంబరు 72869 47977లో సంప్రదించవచ్చు.

– ఎం.సుధాకర్, అవార్డు సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటర్



శివాపురం తండాలో వాటర్ ట్యాంకరు ద్వారా మొక్కలకు నీటి సరఫరా

హార్టికల్చర్ విధానంలో....

ఎంపిక చేసిన రైతులలో ఒక్కొక్కరికి ఎకరా పరిమితితో 48 మామిడి, 32 బత్తాయి మొత్తం 80 మొక్కలు ఉచితంగా ఇస్తారు. పొలం గట్ల రక్షణ కోసం టేకు మొక్కలు, లైవ్ ఫెన్సింగ్ కోసం గోరింటాకు మొక్కలు కూడా ఉచితంగా అందిస్తారు. గుంతలు తవ్వడం, మొక్కలు నాటడం, పాదులు చేసుకునేందుకు, కలుపు తీత ఖర్చులను నగదు రూపంలో సాయం చేస్తారు. సస్య రక్షణ కోసం వేప పిండి, సూక్ష్మపోషకాలు, పురుగు మందులను ఐదేళ్ల పరిమితితో అందజేస్తారు. భూసార అభివృద్ధి పనులలో భాగంగా ఎంపిక చేసిన పొలాల్లో రాళ్ల ఏరి కట్టలు పోసుకున్నందుకు అయిన ఖర్చులో రైతు వాటాగా 25 శాతం మినహాయించి మిగిలిన మొత్తం క్యూబిక్ మీటర్‌కు రూ.400 చొప్పున నాబార్డు నగదు రూపంలో చెల్లిస్తుంది. వాటర్ రీసోర్స్ డెవలప్‌మెంట్ యాక్టివిటీస్‌లో భాగంగా నీటి ఆవశ్యకత గల పొలాలకు వాటర్ ట్యాంకర్‌ల ద్వారా ఉచితంగా సరఫరా చేస్తారు. నీటి వసతి లేని రైతుల కోసం బోర్లు, కుంటలు ఏర్పాటు చేస్తారు. 10 ఎకరాల భూమికి ఒక బోరు చొప్పున రైతుల వాటా 25 శాతం పోగా మిగతా మొత్తం నాబార్డు ద్వారా చెల్లిస్తారు. కుంటల ఏర్పాటుకు రూ.30 వేలు ఉచితంగా ఇస్తారు. కుంటలలో చేపలు పెంచుకొని తద్వారా అదనపు ఉపాధి పొందేందుకు కూడా అవకాశాలు కల్పిస్తారు. భూమిలేని నిరుపేదలకు జీవనోపాధి కల్పనలో భాగంగా గేదెలు, గొర్రె పిల్లలను, టైలరింగ్, చేపలు పట్టడం లాంటి వృత్తుల వారికి కుట్టుమిషన్‌లు, వలలు, బడ్డీ దుకాణం ఏర్పాటుకు రూ.50 వేల వరకు పరిమితితో ఆర్థిక సహాయం అందిస్తారు. పంట వేసిన మూడో ఏడాది నుంచి రైతుల ఆరోగ్యం కోసం ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తారు. ప్రాజెక్టు విజయవంతంగా చేపట్టిన ప్రాంతాలకు ఆసక్తి గల రైతులను తీసుకెళ్లి అవగాహన కల్పించి, శిక్షణ తరగతులు నిర్వహిస్తారు.



ఉదయ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఫాం పాండ్

క్లుప్తంగా

రేపు జాబ్‌మేళా

పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈ నెల 29న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ. తమ్మాజీ రావు తెలిపారు. నియోజకవర్గంలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు పి. శ్రీకాంత్ 94921 58153, ఆర్. కిరణ్ నాయక్ 78427 47682 నెంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



నరసరావుపేట రూరల్: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం స్పెషలిస్ట్ కె.ప్రదీప్ తెలిపారు. కాకానిలోని జేఎన్టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో పోలీస్ శాఖ సహకారంతో బుధవారం సైబర్ క్రైంపై వర్క్‌షాప్ నిర్వహించారు. నేరాల నివారణ, సైబర్ భద్రతకు సంబంధించిన అంశాలపై ప్రదీప్ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాప్‌లకు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, కళాశాల వ్యాయామ సంచాలకులు డాక్టర్ జీపీ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మృతురాలి కంటి రెటీనా సేకరణ



అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లికి చెందిన శనగపల్లి సామ్రాజ్యం బుధవారం మృతి చెందింది. ఆమె కోరిక మేరకు కుమారుడు శ్రీనివాస ప్రసాద గుప్తా కళ్లను దానం చేసేందుకు గుంటూరు శంకర్ కంటి ఆసుపత్రిని సంప్రదించారు. ఆసుపత్రి సిబ్బంది వచ్చి కంటి రెటీనాలను సేకరించుకు వెళ్లారు.

అట్రాసిటీ కేసుల్లో కుల ధ్రువీకరణ పత్రాలివ్వండి

రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితుల కుల ధ్రువీకరణ పత్రాలు వెంటనే అందించి కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని బీఆర్ అంబేడ్కర్ సమావేశ మందిరంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కమిటీ సభ్యుల కోరిక మేరకు ప్రతి నెలా నాలుగో శనివారం కలెక్టరేట్‌లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తామన్నారు. కమిటీ సభ్యులకు ఉచిత బస్ పాస్, ఇళ్ల స్థలాల డిమాండును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా చూసే బాధ్యత కమిటీ సభ్యులపై ఉంటుందని గుర్తు చేశారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ శాంతిభద్రతలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అట్రాసిటీ కేసులను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక అధికారిని నియమించినట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరె, డీఆర్వో మురళి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఓబుల నాయుడు, జిల్లా అధికారులు మరియు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జిల్లా స్థాయి సైన్స్ మేళా





ప్రాజెక్టు ప్రదర్శిస్తున్న విద్యార్థులతో తిరుమలేష్, ఎంఈవో రమణయ్య, ఖాసిం తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యాశాఖ-నెహ్రూ యువ కేంద్ర సంయుక్తంగా బుధవారం పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి సైన్స్ మేళా ఆకట్టుకుంది. జిల్లా వ్యాప్తంగా అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేసిన 30 పాఠశాలల నుంచి 70 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. డీసీఈబీ కార్యదర్శి ఎ.తిరుమలేష్, గుంటూరు ఎంఈఓలు బీవీ రమణయ్య, జ్యోతికిరణ్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, పాఠశాల హెచ్ఎం వసుంధర, నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి కిరణ్మయి ప్రదర్శన ప్రారంభించారు. జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా మాట్లాడుతూ అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను కలిగి ఉన్న ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో వైవిధ్యమైన ప్రాజెక్టు నమూనాలతో ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ ప్రాజెక్టు నమూనాలను ఎంపిక చేసిన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. సంబంధిత విద్యార్థులకు జిల్లాస్థాయిలో జరిగే యువజనోత్సవంలో బహుమతులు అందజేస్తారని తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థుల్లో వ్యక్తిగత విభాగంలో నారాకోడూరు జెడ్పీ హైస్కూల్, సెయింట్ జోసఫ్ హైస్కూల్, నంబూరులోని జెడ్పీ హైస్కూల్‌తో పాటు గ్రూపు విభాగంలో మేడికొండూరు జెడ్పీ హైస్కూల్, రావెల జెడ్పీ హైస్కూల్, మోతడకలోని శ్రీరామా హైస్కూల్ వరుసగా తొలి మూడుస్థానాల్లో నిలిచాయి. రీసోర్స్ పర్సన్లు శివశంకరరావు, అప్పారావు, బాబూరావు, మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన అవసరం



నరసరావుపేట ఈస్ట్: హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. వరల్డ్ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో స్టాళ్లు ఏర్పాటు చేశారు. వీటిని ప్రారంభించిన డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఈ స్టాల్స్ రెండురోజుల పాటు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలో సమగ్ర సలహా, పరీక్షలు, ఐసీటీసీ, గర్భిణులకు పీపీటీసీ కేంద్రాలు 9 అందుబాటులో ఉన్నాయన్నారు. వీటితోపాటు ప్రాథమిక, అర్బన్ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులలో ఉచితంగా హెచ్ఐవీ పరీక్షలు చేస్తారని తెలిపారు. సహరించిన ఆర్టీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సవాల నిర్వహణకు చేయూత

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాల నిర్వహణలో స్థానిక శ్రీచక్ర సిమెంట్స్ చేయూతనందిస్తోంది. ఉత్సవ ప్రాంగణం చదును చేయడానికి, రోడ్ల గుంతలు పూడ్చడానికి, ఎడ్ల పోటీల కోర్టు బాగుకు 30 టిప్పర్ల దాకా మట్టి తోలించారు. ఎడ్ల పోటీల బహుమతిని కూడా అందిస్తున్నారు. ఉత్సవాలకు వచ్చే ప్రజలకు తాగునీరు ట్యాంకర్ల ద్వారా అందించే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు డాక్టర్ యశోదరకు అవార్డు ప్రదానం



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ యశోదర పువ్వాడకు కెనడా దేశానికి చెందిన సంఘ సేవకురాలు షారోన్ పేరిట ఏటా ఇస్తున్న షారోన్ అంతర్జాతీయ స్మారక అవార్డు-2024ను గురువారం ప్రదానం చేస్తారు. స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థ పెన్నీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బుర్రిపాలెం రోడ్డులోని 'ఎస్' భవనంలో మధ్యాహ్నం మూడు గంటలకు ఏర్పాటయ్యే ప్రత్యేక సభలో డాక్టర్ యశోదరకు ఈ అవార్డును బహూకరించనున్నట్టు సంస్థ డైరెక్టర్ ప్రదీప్ దోనేపూడి తెలిపారు. వివిధ రంగాల ప్రముఖులు అతిథులుగా హాజరవుతారని చెప్పారు. డాక్టర్ యశోదర పువ్వాడ వైద్యశాస్త్రంలో మాస్టర్ డిగ్రీ అందుకున్నారు. పట్టణంలో సొంతంగా ప్రాక్టీస్ చేస్తున్నారు. 'స్కిన్-ఇన్' హాస్పటల్ ఎండీగా మానవ శరీరంలో ప్రాముఖ్యం చర్మవ్యాధుల రుగ్మతలపై చికిత్స చేస్తున్నారు. బొల్లి, కుష్ఠు వ్యాధుల నివారణలోని కృషిచేస్తూ, చర్మవ్యాధుల నిపుణురాలిగా పేరుతెచ్చుకున్నారు. లైంగికంగా సంక్రమించే వ్యాధుల నివారణలోనూ పేరుతెచ్చుకున్నారు. పెన్నీ మినిస్ట్రీస్ సంస్థ రెండు దశాబ్దాలుగా కుష్ఠు రోగులు, హెచ్ఐవీ పీడితులకు, వితంతువులకు ఆరోగ్య, ఆహార సేవలను అందిస్తోంది. ఆరోగ్య సేవలకు డాక్టర్ యశోదర స్వచ్ఛందంగా తోడ్పడుతున్నారని ప్రదీప్ వెల్లడించారు. ఆమె సేవలకు గుర్తింపుగా షారోన్ అవార్డును అందజేస్తున్నట్టు తెలిపారు. గతేడాది ఇదే అవార్డును డీ3 శారద సర్వీసెస్ సొసైటీ వ్యవస్థాపకురాలు, ప్రముఖ సంఘసేవకులు డాక్టర్ డి.శారదకు అందజేశారు.

ఆవిష్కరణల దిశగా విద్యార్థులు సాగాలి



మాట్లాడుతున్న కేపీ చౌదరి

నరసరావుపేట రూరల్: విద్యార్థులు నూతన ఆవిష్కరణల దిశగా ముందుగా సాగాలని, భవిష్యత్తులో పారిశ్రామికవేత్తలుగా రాణించాలని ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ కేపీ చౌదరి పేర్కొన్నారు. ఏఎం రెడ్డి ఫార్మసీ కళాశాలలో ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్ అనే అంశంపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కేపీ చౌదరి మాట్లాడుతూ.. యువత ఎంఎస్ఎంఈ ద్వారా నూతన పరిశ్రమల స్థాపనకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. విధివిధానాలు, కల్పించే అవకాశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్‌రావు, డీన్ డాక్టర్ ఎంఎల్ సురేఖ, కార్యక్రమ కోఆర్డినేటర్లు సీహెచ్ అజయ్‌కుమార్, డాక్టర్ డి.అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో అదనపు డీఎంహెచ్‌ఓ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న పద్మావతి

మాచవరం: మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అదనపు డీఎంహెచ్ఓ పద్మావతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఇక్కడ అందిస్తున్న వైద్య సేవలు, ఆశా వర్కర్లు, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల ఆరోగ్య వివరాలను యాప్‌లో నమోదు చేయాల్సిన తీరును వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ప్రసాద్, అన్వేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు

జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు



వరిచేలో శాస్త్రవేత్తలతో నున్న వెంకటేశ్వర్లు

తెనాలి: జిల్లాలోని అన్ని మండలాల్లో ఏర్పాటు చేసిన రైతుసేవా కేంద్రాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయనున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు చెప్పారు. రైతులు తీసుకొచ్చిన 17 శాతం తేమతో ఉన్న సరుకును 75 కిలోల బస్తా రూ.1,740 చొప్పున కొనుగోలు చేస్తామని తెలిపారు. సోమసుందరపాలెంలో బాపట్ల వరి పరిశోధన స్థానం నుంచి తెచ్చిన బీపీటీ-3082 వరి రకం సాగు చేసిన పొలాన్ని శాస్త్రవేత్తలు డాక్టర్ వి.కృష్ణవేణి, డాక్టర్ టి.హరిత సందర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రబీ పంటలకు ఇన్సూరెన్స్ ప్రీమియాన్ని కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా చెల్లించాలని సూచించారు. హార్వెస్టింగ్ యంత్రాలతో పంటను నూర్చిన తర్వాత, మిగిలిన గడ్డిని తగులబెట్టవద్దని రైతులకు సూచించారు. మల్చర్‌తో ముక్కలు చేసి భూమిలో కలపాలని చెప్పారు. బాపట్ల వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ వి.కృష్ణవేణి మాట్లాడుతూ సోమసుందరపాలెం గ్రామంలోని పి.మధుసూనదరావు చేలో వేసిన బీపీటీ-3082 రకం వరిని మినీకిట్ రూపంలో ఉన్నదని చెప్పారు. మధ్యస్థరకమని, కాలవ్యవధి 135 రోజులుగా తెలిపారు. సన్న గింజ ఉంటుందని దోమపోటు, అగ్గితెగులును తట్టుకుంటుందని చెప్పారు. కంకి పొడవుగా ఉండి, 250-300 గింజలు ఉంటున్నాయని, తినడానికి కూడా అనువుగా ఉంటుందని వివరించారు. వీరితో మండల వ్యవసాయ అధికారి జి.ప్రేమసాగర్ కూడా ఉన్నారు.

రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు



మంత్రి నాదెండ్ల మనోహర్‌కు సమస్యలను వివరిస్తున్న మాగంటి హరిబాబు

తాడేపల్లిరూరల్ : ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు, సంఘం నాయకులు మంత్రి నాదెండ్ల మనోహర్‌కు విన్నవించారు. బుధవారం తాడేపల్లిలో పర్యటిస్తున్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను వారు కలిశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతు వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిందని, రైతు వద్ద ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతు ఖాతాలో నగదు జమ అవుతుందని చెప్పారని, కానీ ఆచరణలో జరగడం లేదని వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గోనె సంచులు లేవని, తేమశాతం రైతు సేవా కేంద్రాల ద్వ ఫైనల్ చేసి ధర నిర్ణయించాలని చెప్పారు. ఇంకా పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ 23 శాతం తేమ ఉన్నా ధాన్యం సేకరించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. చిర్రావూరు గ్రామంలో ఉన్న ధాన్యాన్ని కాటావేసి లోడింగ్ వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు 24 గంటలలో నగదు జమయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో తాడేపల్లి మండల వ్యవసాయ అధికారి ఎ.శ్రీనివాస్, వ్యవసాయ అధికారులు, ఏపీ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, నాయకులు పల్లపాటి సుబ్బారావు, రైతు సంఘం నాయకులు బొప్పన గోపాలరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పరిమిశెట్టి శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ జాతీయ ఉత్తమ కార్యదర్శిగా డాక్టర్ నరేంద్ర రెడ్డి



గుంటూరు మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ ఉత్తమ కార్యదర్శిగా సీనియర్ జాయింట్ రిప్లేస్మెంట్ సర్జన్, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి ఎంపికయ్యారు. 2023-2024 సంవత్సరానికి గుంటూరు బ్రాంచ్‌ను జాతీయ స్థాయిలో పలు విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచేలా తీర్చిదిద్దినందుకు డాక్టర్ బూసిరెడ్డిని ఈ అవార్డు వరించింది. ఈ మేరకు బుధవారం ఢిల్లీలోని ఐఎంఏ ప్రధాన కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. వచ్చేనెల డిసెంబర్ 27న హైదరాబాద్‌లో జరగనున్న ఐఎంఏ జాతీయ సమావేశాల్లో డాక్టర్ నరేంద్రరెడ్డికి ఈ అవార్డును అందజేయనున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా డాక్టర్ బూసిరెడ్డి అనేక కార్యక్రమాలు చేపట్టి గుంటూరు బ్రాంచ్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారు. గుంటూరు బ్రాంచ్ చరిత్రలో నిలిచిపోయేలా విజయవాడ వరదల సమయంలో ఆపన్నులను ఆదుకునేందుకు సుమారు రూ. 15 లక్షలకుపైగా వైద్యుల నుంచి సేకరించి రాష్ట్ర శాఖ ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. వరదల కారణంగా బురదమయమైన గృహాలను శుభ్రపరిచేందుకు 50కిపైగా హై ప్రెజర్ పంపులను సేకరించి అగ్నిమాపక శాఖకు అందజేశారు. ఈ విషయమై జాతీయ స్థాయి నుంచి ప్రశంసలు అందాయి. అలాగే డాక్టర్స్ దివాళి సెలబ్రేషన్స్, ఇఫ్తార్ విందు, ఆర్ జి కర్ నిరసన కార్యక్రమాలను తనదైన శైలిలో నిర్వహించి గుంటూరు బ్రాంచ్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారు. ఉత్తమ కార్యదర్శిగా ఎంపికైన డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డిని ఐఎంఏ రాష్ట్ర, స్థానిక నాయకులు, పలువురు వైద్యులు, అభినందించారు.

పొదుపు సంఘాలకు రుణాలిచ్చేందుకు బ్యాంకులు సిద్ధం



ప్రసంగిస్తున్న గౌతమ్

తాడేపల్లిరూరల్: బ్యాంకులు పొదుపు సంఘాలకు అవసరమైన రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయని, ఎవరికీ ఎలాంటి కమీషన్లు ఇవ్వాల్సిన అవసరం లేదని స్వయం సహాయక సంఘాల రాష్ట్ర సమన్వయ కమిటీ సీనియర్ మేనేజర్ గౌతమ్ స్పష్టం చేశారు. బుధవారం వడ్డేశ్వరంలో స్వయం సహాయక సంఘాల రాష్ట్ర సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సీహెచ్ రమణి అధ్యక్షతన డ్వాక్రా గూపు సభ్యులకు సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గౌతమ్ మాట్లాడుతూ పొదుపు సంఘాల నుంచి రుణాల మంజూరుకు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వీఓఏల సంతకాలు లేకపోతే అవసరమైన డాక్యుమెంటేషన్ వారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. లోన్ సమయంలో బలవంతపు ఇన్సూరెన్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్, కమీషన్ల వసూలు నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలు పొదుపు సొమ్ము అంతర్గత రుణాలు తీసుకోవడానికి ఆటంకాలు సృష్టిస్తున్నారని, రుణ మంజూరుకు నెలల సమయం పడుతోందని గౌతమ్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన సమస్యలపై ఉన్నతాధికారులతో చర్చిస్తామని చెప్పారు. రుణాల్లో జరుగుతున్న మోసాలను అరికట్టేందుకు యత్నిస్తున్నామని వివరించారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపుల్లో కోట్ల రూపాయల అవినీతి జరుగుతోందని, అవినీతిలో భాగస్వాములు అవుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రుణాల ప్రాసెసింగ్ చార్జీలు రద్దు చేయాలని కోరారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడుతూ మహిళలు పురోగతి సాధించాలంటే డ్వాక్రా మహిళలు ఐక్యంగా ఉండాలని అన్నారు.కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస కుమారి, ఐద్వా రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ శ్రీదేవి, పి. పూర్ణ, వై. సత్యవతి, బి. పద్మ, జి. అమల పాల్గొన్నారు.

7న విజ్ఞాన్ వర్సిటీ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ రెండో స్నాతకోత్సవం



ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న వైస్ చాన్సలర్ పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు

చేబ్రోలు: విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆన్‌లైన్ లెర్నింగ్, ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్‌లో ఎంసీఏ, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులకు డిసెంబర్ 7న శనివారం 2వ స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, తదితరులు స్నాతకోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ డిసెంబర్ 7న జరిగే 2వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీక్రిష్ణ దేవ రావు హాజరవుతారని తెలిపారు. 2వ స్నాతకోత్సవం సందర్భంగా తమ యూనివర్సిటీ 858 (ఎంబీఏ-668, ఎంసీఏ-190) మంది ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనుందని తెలిపారు. 2వ స్నాతకోత్సవంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్, చాన్సలర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ శ్రీకృష్ణదేవరాయలు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, అకడమిక్ కౌన్సిల్, ఆయా విభాగాల డీన్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొంటారని వీసీ నాగభూషణ్ తెలిపారు.


రేపు కొమ్మారెడ్డి సాహితీ పురస్కార ఉత్సవం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఐక్య ఉపాధ్యాయ పత్రిక మాజీ ప్రధాన సంపాదకుడు, సాహితీవేత్త కొమ్మారెడ్డి కేశవరెడ్డి సాహితీ పురస్కార ఉత్సవాన్ని ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం పురస్కార ఉత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఈనెల 29న సాయంత్రం 5 గంటలకు బ్రాడీపేట రెండోలైనులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో కొమ్మారెడ్డి సాహితీ పురస్కారాన్ని ప్రముఖ రచయిత్రి ఓల్గాకు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ప్రముఖ సాహితీ విమర్శకుడు పాపినేని శివశంకర్, ఉపాధ్యాయులు, సాహిత్య అభిమానులు పాల్గొంటారని తెలిపారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు, వై.నాగమణి, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, జి. వెంకటేశ్వరరావు, ఎండీ షకీలాబేగం, కె.రంగారావు, బెల్లంకొండ ప్రసాద్, కె. ప్రేమ్‌కుమార్, కోటిరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి రూబీ టోర్నమెంట్



పెదకాకాని: మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామంలోని వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి 68వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన అంతర్ జిల్లా రూబీ టోర్నమెంట్, ఎంపికలు నిర్వహిస్తున్నారు. ఈ టోర్నమెంట్‌కు సంబధించిన షెడ్యూల్, ఆహ్వాన పత్రికను బుధవారం అధ్యాపకులు, టోర్నమెంట్ నిర్వాహకులు ఆవిష్కరించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ అండర్-17 బాలుర పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 186 మంది క్రీడాకారులు హాజరవుతున్నారని నిర్వాహకులు తెలిపారు. పోటీల ప్రారంభోత్సవ సభకు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జిల్లా విద్యాశాఖ అధికారులు హాజరవుతారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్ తిరుపతిరావు తెలిపారు. పోటీలను వ్యాయామ అధ్యాపకుడు పి మస్తాన్‌రెడ్డి పర్యవేక్షిస్తారని తెలిపారు.

వికాస ఎన్నికలకు నామినేషన్లు దాఖలు

ఏఎన్‌యూ: విశ్వవిద్యాలయ ఉద్యోగ సంఘం (వికాస) ఎన్నికలకు బుధవారం నామినేషన్లు దాఖలు అయ్యాయని ఎన్నికల అధికారి ప్రొఫెసర్ ఎస్.మురళీమోహన్ తెలిపారు. ఉద్యోగులు ఫ్రెండ్స్ ప్యానెల్‌గా ఏర్పడి నామినేషన్ వేయటం జరిగింది.

ఫ్రెండ్స్ ప్యానెల్ అభ్యర్థులు: ఎస్.ప్రసాద్ (అధ్యక్షులు), డి.విజయ ప్రకాష్‌బాబు (ఉపాధ్యక్షులు), జె. శ్రీనివాసరావు (కార్యదర్శి), టి.వెంకటేష్, ఎన్.నాగేశ్వరరావులు (సంయుక్త కార్యదర్శులు), కె.యేషయ్య, (కోశాధికారి)

ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా అభ్యర్థులు: జి.శ్రీను, కె.శశిధర్, పి.నాగరాజు, ఎన్.వెంకటేశ్వరరావు, ఇ.శ్రీనివాసరెడ్డి, ఎన్.శ్రీనివాసరావు, టి.వెంకటేశ్వరరావు, సీహెచ్.సాంబశివరావు, సీహెచ్. ఆనంద్.

46,174 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు బుధవారం 46,174 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 43,594 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 14,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 38,956 బస్తాలు నిల్వ ఉన్నాయి.